# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 14 మార్చి 2025

## ప్రజా సమస్యల పరిష్కారానికి
# ఎన్డీయే ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోంది

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి, మార్చి 13 ప్రభాత వార్త



ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత నిస్తోందని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి నిర్వహించిన ప్రజాధర్ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధ్యతల సమస్యలు పరిష్కరించారు.

## అంతర్జాతీయ సదస్సులో ప్రదీప్‌కు ప్రథమ బహుమతి

రాజంపేట అర్బన్ మార్చి 13 ప్రభాతవార్త



స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న వై .ప్రదీప్ కుమార్ అంతర్జాతీయ సదస్సులో పదం బహుమతి సాధించారు. నంద్యాల శాంతరాం ఫార్మసీ కళాశాల నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో స్త్రీలలో వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్ కు ఉపయోగించే ఔషధంపై ప్రదీప్ కుమార్ సమర్పించిన పరిశోధనా పత్రానికి మొదటి బహుమతి లభించినట్లు అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి స్వర్ణలత తెలిపారు.ఈ విజయాన్ని సాధించినందుకు కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, చైర్మన్ డాక్టర్ సి రామచంద్ర రెడ్డి, కోశాధికారి సి.అభిషేక్ రెడ్డి ,కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డిలు ప్రదీప్ కుమార్‌ను అభినందించారు.

# కాశినాయన క్షేత్ర అభివృద్ధిపై కేంద్ర మంత్రిను కలిసిన కూటమి నాయకులు





బద్వేలు, మార్చి 13 , ప్రభాతవార్త

ఎంతో సున్నితమైన అంశమైన కాశినాయన జ్యోతి క్షేత్రం అంశంపై కూటమి నాయకులైన టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి, బిజెపి జిల్లా పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు లు కేంద్రమంత్రి భూపేష్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం వారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎంపీ పురందేశ్వరి ఆధ్వర్యంలో పలువురు నాయకులతో కలిసి ఢిల్లీకి చేరుకుని అక్కడ నియోజకవర్గ సమస్య అయిన కాశినాయన అంశాన్ని ఆయనకు వివరించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే కాశినాయన ఆలయ నిర్మాణాల కూల్చివేత ఘటన పై భక్తుల మనోభావాలు పరిగణనలోకి తీసుకుని ఫారెస్ట్ క్లియరెన్స్ అనుమతులు ఇచ్చి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి ఆలయ సమస్య తీవ్రతను అర్థం చేసుకుని, సానుకూలంగా స్పందించి త్వరలోనే దీనికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వీరితోపాటు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి , జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్తభూపేష్ రెడ్డి , శశిభూషణ్ రెడ్డి , సింగారెడ్డి మరియు ఆర్ఎస్ఎస్, వి హెచ్ పి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మల్లూరమ్మ తల్లికి
# పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి



చిన్నమండెం, మార్చి 13 ప్రభాతవార్త :

మండలంలోని కొత్తపల్లెలో మల్లురమ్మ తిరుణాల సందర్భంగా గురువారం రాత్రి రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి మల్లూరమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రివర్యులు మల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుత వేసవి కాలంలో రాయచోటి నియోజకవర్గంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ఉండాలని, మల్లురమ్మ తల్లికి పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులను అర్చక స్వాములు పూర్ణకుంభ స్వాగతం పలికి మల్లూరమ్మ తల్లి సన్నిధికి తీసుకెళ్లారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మంత్రి పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు

: హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

బద్వేలు అర్బన్, మార్చి13 (ప్రభాతవార్త) :



బద్వేలు మండల పరిధిలోని లక్ష్మిపాళెంలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో బాగంగా గురువారం ఐదవ రోజు తెల్లవారుజామునుంచే వేద పండితులు మంత్రోచ్చారణల మద్య స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా బద్వేలు పట్టణ పరిసర ప్రాంతాలవారు విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా దేవాదాయ కార్యనిర్వహణాదికారి రామలింగారెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ చాటకొండు సత్యసంజీవ్‌కుమార్, ధర్మకర్తలు భూపాళం రాఘవేంద్ర, కర్ణమడకల బీనా, నల్లి వీరమ్మ,సంపతి వెంకటసుబ్బయ్య, అనగొంది ఓబులేసు, ఒంటె చిన్న పీరయ్య, నాగయ్యగారి సిద్దమ్మ, మజ్జారి లక్షుమ్మ, మరియు గ్రామస్థులు భక్తులకు స్వామివారికి ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాత్రి హనుమంత వాహనముపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికిఅడుగడుగునా మంచినీరు వారుపోసి తమభక్తిని చాటుకున్నారు ప్రత్యేక ఉభయదాతలుగా పగలు ఉత్సవానికి ఆర్యవైశ్య సంఘం, మరియుఉ రాత్రి ఉత్సవానికి మాఘం పద్మావతి, గంగయ్య, అలాగే ప్రొద్దుటూరుకు చెందిన మెంటా రాఘవయ్య గారి వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు ఉదయ్‌కుమార్, ప్రసన్నకుమార్, కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# జమ్మలమడుగులో మహిళలకు ఉచిత సివిల్స్ శిక్షణ

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

చొరవతో లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ శిక్షణ కార్యక్రమం

జమ్మలమడుగు, మార్చి 13, ప్రభాతవార్త:

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మరియు టీడీపీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి చొరవతో ఢిల్లీకి చెందిన ప్రముఖ సివిల్స్ కోచింగ్ సంస్థ డా.లక్ష్మయ్యకుయ ఐఎఎస్ స్టడీ సర్కిల్ వారు జమ్మలమడుగులో ఈనెల 16 ఆదివారం సంస్కృకతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఉచిత సివిల్స్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో ఎన్నో సంవత్సరాలుగా లక్ష్మయ్య ఐఎఎస్ స్టడీ సర్కిల్ నుంచి ఎంతో మంది సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గంలో కూడా డిగ్రీ పూర్తి చేసుకున్న యువతుల కోసం అన్ని వసతులతో కూడిన ఉచిత శిక్షణను అందించాలనే తపనతో లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ వారిని సంప్రదించగా వారు ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం కోసం ముందుకు వచ్చారని ఆయన చెప్పారు. జమ్మలమడుగులోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 16 ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఆశావహులకు సివిల్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించిన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులకు అర్హత పరీక్ష నిర్వహించి ఎంపికైన వారికి 2 సంవత్సరాల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కావునా నియోజకవర్గ పరిధిలోని డిగ్రీ పూర్తి చేసుకున్న మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం 9885664465 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

## ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ళ నిర్మాణాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల
# లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి, మార్చి 13ప్రభాత వార్త



ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ళ నిర్మాణాలలో బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా ఇళ్ళ నిర్మాణం చేసుకుంటున్న బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం పై పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రివర్యులు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా ఇంటి నిర్మాణంలో పూర్తిగా కాకుండా నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు సంబంధించి బి సి, ఎస్ సి, ఎస్ టి వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ ఖర్చులు అధికమవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రభుత్వం తీసుకున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎస్టీ వర్గానికి చెందిన వారికి 75 వేల రూపాయలు ఎస్సీ, బీసీ వర్గాల వారికి 50 వేల రూపాయలు అందిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సాయం మొత్తాన్ని వివిధ దశలలో అందజేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయం గతంలో ప్రభుత్వం వారు అందిస్తున్న 1.8 లక్షల రూపాయలకు అదనంగా ఇస్తున్నట్లుగా పేర్కొన్నారు. బిఎల్ దశలో 50 వేల రూపాయలు, చివరి దశలో ఉన్న ఇళ్లకు 10000 లేదా 15 వేల రూపాయలు (వర్గాన్ని బట్టి) అందిస్తామని, అలాగే వివిధ దశలలో ఉన్న ఇళ్లకు ఆయా దశలబట్టి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. అన్నమయ్య జిల్లాలో దాదాపు 19672 మందికి 100 కోట్ల రూపాయల అదనపు ఆర్థిక సాయం అందుతుందని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ నుండి 23 వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం గురించి చెప్పి దశలవారీగా నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విషయంపై అన్ని మండలాల ఎంపీడీవోలకు హౌసింగ్ సిబ్బందికి ఇదివరకే తగిన ఆదేశాలు జారీ చేశామన్నారు. అన్నమయ్య జిల్లాలో 75 వేల లబ్ధిదారులకు గాను దాదాపు 37 వేల మంది ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు పకడ్బందీ భద్రతతో,
# ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు

పరీక్షల సమయం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 వరకు

జిల్లాలో 27,800 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప మార్చి 13 ప్రభాతవార్త :



ఈ నెల 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరుగు పదవ తరగతి పరీక్షలు పకడ్బంది భద్రతతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్ నందు పదవ తరగతి పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరుగు పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 వరకు నిర్వహించడం జరుగుతుందని అందుకు కట్టుదిట్టమైన పకడ్బందీ భద్రతతో, ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహిణ జరగాలని అన్నారు. జిల్లాలో 161 పరీక్షా కేంద్రాలలో 14,330 మంది బాలురు, 13,470 మంది బాలికలు మొత్తం 27,800 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను కల్పించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఇన్విజిలేటర్స్ , ఇతర ఉన్నత అధికారులతో సహా ఇతర సిబ్బంది ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు వెంట తీసుకువెళ్లారాదన్నారు. పోలీస్ సిబ్బంది ముందస్తుగానే తనిఖీ చేయాలన్నారు. ఎక్కడ మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలన్నారు. అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. త్రాగునీరు, మరుగుదొడ్లు, లైట్ లు, ఫాన్స్, ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. విద్యార్థుల కు అంతరాయం కలుగకుండా ఆర్టీసీ బస్సు సర్వీసు లను ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అన్నారు. పోస్టల్ శాఖవారు పరీక్షా పత్రాల ను పరీక్షా కేంద్రాలకు భద్రత తో అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్షల సమయంలో ఆయా ఆర్డీవోలు, తహసీల్దార్ లు విజిట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కడప,బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, చిన్నయ్య, సాయిశ్రీ, తహసీల్దార్ లు, విద్యా శాఖ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సరళమైన తెలుగులో
# రామాయణం రచించిన గొప్ప కవియత్రి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

కడప మార్చి 13 ప్రభాతవార్త :



సరళమైన తెలుగు భాషలో రామాయణం రచించి సమాజానికి అందించిన గొప్ప కవియత్రి మొల్లమాంబ అని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన శ్రీ మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాహితీవేత్త నరాల రామారెడ్డి, మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు డా. విద్వాన్ గానుగపెంట హనుమంత రావు హాజరుకాగా జిల్లా పోలీస్ అధికారి అశోక్ కుమార్, డిఆర్ ఓ విశ్వేశ్వరనాయుడు ,ఇరత జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... రామాయణ మహా గ్రంథాన్ని పలువురు వివిధ భాషలలో రచించారని.. అయితే వాల్మీకీ లాంటి మహనీయులు రచించిన రామాయణ గ్రంథాలను ఆధారం చేసుకుని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు బాషలో మొల్ల రామాయణాన్ని సరళంగా రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. వైయస్సార్ జిల్లా బద్వేలు వద్ద గల గోపవరం గ్రామానికి చెందిన మొల్ల రామాయణాన్ని అతి తక్కువ పద్య గద్యాలతో అత్యంత సులువమైన శైలిలో తనదైన ముద్రతో రచించి నాటి పండిత పామరుల ప్రశంసలు పొందారన్నారు. మానవీయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు వివక్షతకు వ్యతిరేకంగా తన రచనలు చేశారని కొనియాడారు.తొలి తెలుగు రచయిత్రిగా చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని మొల్ల పదులపరుచుకున్నారని అన్నారు. మొల్ల జయంతి ఉత్సవాల్లో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథులతో కలిసి మొల్లమాంబ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు,బీసీ వెల్ఫేర్ అధికారి భరత్ కుమార్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ,సిపిఓ హాజరతయ్య, మొల్ల సాహితీ పీఠం సభ్యులు, బీసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ముంచిన వారినే నమ్మి నట్టేట మునిగారు

ఓటుతో మాయగాళ్లకు గుణపాఠం చెప్పండి

అన్నమయ్య వరద బాధితులతో జగన్‌రాజు



అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులతో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

రాజంపేట అర్బన్ మార్చి 13 ప్రభాతవార్త :

అన్నమయ్య డ్యామ్ వరద బాధితుల గోడు వింటే కడుపు తరుక్కుపోతుంది. పగవాడికి కూడా ఈ కష్టాలు రాకూడదు. అంతటి కష్టాలు పడిన మీరు, ముంచిన వారికే ఓటు వేసి మరోసారి నట్టేట మునిగారు. అందుకే మరోసారి వారికి అవకాశం ఇవ్వకండి. ఓటు అనే ఆయుధంతో మాయగాళ్లకు బుద్ధి చెప్పండని అన్నమయ్య ప్రాజెక్టు వరద బాధితులకుతెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్రాజు పిలుపునిచ్చారు. గురువారం అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్ డ్యాం కొట్టుక పోయి సర్వస్వం కోల్పోయిన పులపత్తూరు ,మందపల్లె బాధితులు జగన్మోహన్ రాజును ఆయన కార్యాలయంలో కలిశారు.ప్రాజెక్టు కొట్టుకుపోయి మూడేళ్లు కాస్తున్న ఇంతవరకు దిక్కు దివానం లేదని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని విధాల ఆదుకుంటామని ముంపు బాధితులకు జగన్ మోహన్ రాజు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంచే వారికి ఓటు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.జీవితాలు మారాలంటే మంచి వారికి ఓటు వెయ్యాలి. ఇన్ని రోజులు మీ ఓటుతో అధికారం చెలాయించిన వారు మీకు ఏమి చేశారని ప్రశ్నించారు. చేసారు. మీ జీవితాలు మారాలంటే మిమ్మల్ని ప్రాజెక్టు కింద ముంచి మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలని కోరారు. మీరేమో నేటికీ గుడారాలలోనే బతుకుతున్నారని, వారేమో ఎస్టేట్లో విలాసాలు అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. అందుకే ఇకనైనా ఆలోచించండి. అన్నమయ్య డ్యామ్ బాధితులకు అన్ని వసతులు కల్పిస్తాం. మంచి చేస్తాం, ఈసారి అయినా టిడిపికి మద్దతు ఇవ్వండని, ఓటు అనే ఆయుధంతో మీ జీవితాలు మార్చుకోండని కోరారు.మాయగాళ్లను నమ్మితే మీ జీవితాలు మారవని స్పష్టం చేశారు.ప్రతి పేదవాడు బాగుపడాలి అన్నదే టిడిపి లక్ష్యమని,మీ సమస్యల పరిష్కారం నా బాధ్యతగా స్వీకరించి పని చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో వరద బాధితుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం వేగంగా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. సమావేశంలో టిడిపి గ్రామీణ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య, కొండా శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణదారులకు అదనపు సాయం

చిట్వేలి, మార్చి 13, ప్రభాతవార్త:

పిఎంఏవై, ఎన్టీఆర్ అసంపూర్తి గృహ నిర్మాణదారులకు ప్రభుత్వం అదనపు సహాయం అందిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ తెలిపారు. గురువారం గ్రామ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఉమ్మడిగా ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణదారులకు ఇస్తున్న 180000 లకు అదనంగా ఎస్సీ, బీసీలకు 50 వేలు;ఎస్టీలకు 75 వేల అదనపు సహాయాన్ని ప్రభుత్వం ప్రకటించిందన్నారు.ఆర్థిక ఇబ్బందులతో ఆగిపోయిన ఇంటి లబ్ధిదారులకు ఇది తీపి కబురని ఎంపీడీవో అన్నారు. ఈ సంఖ్య మండలంలో ఎస్సీ 67, ఎస్టి 27, బిసి 39 గా ఉదన్నారు. లబ్ధిదారులను ప్రోత్సహించి గృహాలు పూర్తయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు




## విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలి

మైదుకూరు, మార్చి 13, ప్రభాతవార్త:



జిల్లా పరిషత్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథి గా జిల్లా పరిషత్ హై స్కూల్ పలుగురాళ్ళ పల్లి హెడ్మాస్టర్ బండి సత్య నారాయణ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సిద్ధంగా ఉండాలని,పరీక్ష కేంద్రానికి 8.30 కి చేరుకోవాలని, భయం లేకుండా పరీక్షలు రాయాలని,బాగా కష్టపడి చదివి పాఠశాలకు, తల్లి దండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ గోశెట్టి రామమోహన్,సీనియర్ ఉపాధ్యాయులు లింగాల సూర్యనారాయణ రెడ్డి, ఆవుల శ్రీనివాసులు,తవ్వా ఓబుల్ రెడ్డి,గుండా పద్మనాభయ్య,మీసాల మునేయ్య, ఆనంద్‌రావు, మూడే సురేంద్రనాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేకలవారిపల్లెలో 2.0 కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్

వాల్మీకిపురం, మార్చి 13. ప్రభాతవార్త :

నాటుసారా తయారీ, అమ్మకాలను స్వచ్ఛాందంగా వదులుకుని మంచి ఉపాధి మార్గం ఎంచుకుని జీవనం సాగించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదే శామేరకు గురువారం మండలంలోని ఎగువ మేకలవారిపల్లెలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఇకపై నాటుసారా అనే మాట వినపడకూడదన్నారు. మీరు సారాను తయారు చేయడం, అమ్మడం వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ఎంతో మంది జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. ఇప్పటికైన ఇలాంటి కార్యక్రమాలను మానుకోకపోతే మీరు ఊహించని చర్యలుంటాయన్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ జయ రాజు మాట్లాడుతూ నాటుసారా వ్యాపారాన్ని పూర్తిగా మానుకోవాలని, లేని ఎడల ఎంతటివారైన సరే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. అంతకు మునుపు నవోదయం పోస్టర్లను పోలీసు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్థులచే నాటు సారా అమ్మకం, తయారీ చట్టరీత్యా నేరమని, స్వచ్ఛాంధంగా ఇలాంటి చర్యలను మానుకుంటామని, మంచి మార్గాన్ని ఎంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటాద్రి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ జిల్లా ఎస్పీ జోగేంద్ర, సీఐలు ప్రసాద్బాబు, లత, ఎస్సైలు చంద్రశేఖర్, మధురామచంద్రుడు, సుభాషిణి, ఎంపీడీవో మనోహర్రాజు, మండలపరిషత్తు, రెవెన్యూ శాఖ అధికారులు, ఎక్సైజ్ పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పిఠాపురం సభకు జనసైనికులు

వేంపల్లి, మార్చి 13, ప్రభాతవార్త :



పిఠాపురంలో శుక్రవారం జరగబోవు జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ దాసరి రవిశంకర్ ఆధ్వర్యంలో గురువారం వేంపల్లి నుంచి బస్సులు, కార్లు, సుమోల్లో బయలుదేరి వెళ్లారు. ముందుగా వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ పిఠాపురం సభను జయప్రదం చేయాలనే ఉద్దేశ్యంతో జన సమీకరణ చేశామని చెప్పారు. ఇందులో భాగంగా సుమారు 150 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగ మల్లికార్జున, ఉమర్, పోలిశెట్టి సాయి కుమార్, ప్రసాద్, అబ్దుల్, మహబూబ్ బాషా, మహేష్, మురళీ, సంపత్, అయ్యవారు, వి.హరినాథ్, సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూనెగింజల పంట సాగుతో అధిక ఆదాయం

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త :



శిక్షణకు హాజరైన రైతులతో వ్యవసాయ అధికారులు

నూనెగింజల పంట సాగుతో రైతులకు అధిక ఆదాయం సాధ్యమని సహాయ వ్యవసాయ సంచాలకులు వైవి రమణ రావు తెలిపారు. గురువారం పీలేరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో డివిజన్ స్థాయిలోని కెవి పల్లి, పీలేరు మండల రైతులకు "జాతీయ మిషన్ వంట నూనెలు నూనె గింజలు" అంశంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు రైతులకు వేరుశనగలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ప్రీ ఎమర్జెన్సీ కలుపు మందు పెండిమితలిన్ వాడకం, పూత దశలో జిప్సం వాడకం, మొక్కల సాంద్రత ,వంటి అంశాలు, వేరుశనగ పంట ప్రాధాన్యతను తెలియజేశారు. పీలేరు మండల వ్యవసాయ అధికారిణి ఓ. రమాదేవి మాట్లాడుతూ రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రాముఖ్యతను తెలియజేశారు. టెక్నికల్ ఏఓ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లోని ఎరువులు, వ్యవసాయ శాఖలోని సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. ఈకార్యక్రమంలో కెవి పల్లి, పీలేరు మండల రైతులు. రైతు సేవా కేంద్రం సిబ్బంది జహీర్, ప్రవీణ్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలం నీరు వృధా చేయడం తగదు

బద్వేలు అర్బన్, మార్చి 13 , ప్రభాతవార్త

ప్రజలు వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి వృధా చేయడం తెగదని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు ప్రజలు వినియోగిస్తున్న నీటిపై సంబంధిత సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని వారికి ఆయన సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారికి పలు సూచనలు ఇస్తూ అక్రమ కుళాయిలు అన్నీ రెగ్యులర్ చేయించాలని చేయించుకోని పక్షంలో కుళాయిలు తొలగించాలని సిబ్బందికి తెలిపారు. అలాగే అన్ని సచివాలయాలలో పన్నుల వసూళ్ల కొరకు కౌంటర్లు ఏర్పాటు చేయడము జరిగిందన్నారు.అంతే కాకుండా ఆన్లైన్ మరియు ఫోన్ పే ద్వారా కూడా చెల్లించవచ్చున్నారు. మార్చి చివరి వరకు సెలవు రోజులలో కూడా పురపాలక కార్యాలయం వద్ద కౌంటర్ ఓపెన్ చేసి వుంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్‌తో పాటు డీఈఈ సుమన్ రెడ్డి మరియు మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు మహేష్, బాబు, అమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## మాలమహానాడు సింహగర్జనకు తరలిరండి

నిమ్మనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :



పోస్టర్ల ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతిలో ఈనెల 23న జరుగు మాలమహానాడు సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిమ్మనపల్లె మండలంలో కరపత్రాలు జిల్లా మాలమహానాడు కార్యదర్శి వీరజాల మాణిక్యం నేడొక ప్రకటనలో తెలిపారు. వీరు గురువారం కరపత్రాల ద్వారా మండలంలోని రాచవేటివారిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాలమహానాడు కార్యదర్శి వీరజాల మాణిక్యం మాట్లాడుతూ ఈ సింహగర్జనకు మాలలందరూ వేలసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నప్పయ్య, ఆనందమ్మ, ఎస్ చంద్ర, డి.వెంకటమ్మ, కస్తూరి. పద్మావతమ్మ, ఆదెమ్మనమ, లక్ష్మమ్మ, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

## బోన్ క్యాన్సర్ విధ్యార్థికీ చేయూత



వేంపల్లి, మార్చి 13, ప్రభాతవార్త :

ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్2 సీఎస్ఈ చదువుతున్న విద్యార్థి ఎస్.సురేంద్రకు క్యాంపస్ లోని హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్, అధ్యాపకులు చేయూత అందించారు. విద్యార్థి బ్లడ్, బోన్ క్యాన్సర్ తో వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోరుమామిళ్లకు చెందిన ఈ విద్యార్థి తండ్రి నిరుపేద రైతు కావడంతో తండ్రి తన కుమారుడిని కాపాడుకునేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంపై ఆర్కేవ్యాలీ అధ్యాపకులు, విద్యార్థులు స్పందించి రూ.5,02,226, మిగతా ఆర్జియూకేటీ క్యాంపస్ల నుంచి రూ. లక్ష లను సేకరించారు. ఈ నగదు మొత్తాన్ని ఆర్కేవ్యాలీ క్యాంపస్ ఏఓ రవికుమార్ చేతుల మీదుగా విద్యార్థి తండ్రి సౌలు రాజుకీ అందజేశారు. అలాగే దాతలు స్పందించి ఆ విద్యార్థికి సహాయం అందించాలని ఏఓ విజ్ఞప్తి చేశారు. సహాయం చేసేందుకు 8688283876 నెంబర్ కీ సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ రమేష్, స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలి

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త :

పీలేరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఎన్టీఆర్ హౌసింగ్ గృహాలు ఇప్పటికే మంజూరు అయి ఉండి ఇప్పటివరకు ప్రారంభించని వారు త్వరితగతిన ప్రారంభించినచో బిసి, ఎస్సి లకు 50 వేల రూపాయలు అదనంగా, అదేవిధంగా ఎస్టీలకు 75 వేల రూపాయలు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని పీలేరు గృహ నిర్మాణ శాఖ ఇన్చార్జి డి ఈ రమణయ్య తెలిపారు. గురువారము స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం ఈ సందర్భంగా డి ఈ రమణయ్య మాట్లాడుతూ తప్పనిసరిగా లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకొని సంబంధిత గ్రామ సచివాలయాల్లో గాని, గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో గాని సమర్పించాలని లబ్ధిదారులను కోరారు. మార్చి నెల ఆఖరి లోపల గృహాలను పూర్తి చేసే విధంగా గ్రామ సచివాలయ సిబ్బంది చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగృహాలకు అదనపు ఆర్థిక సహాయం

లక్కిరెడ్డిపల్లె; మార్చి 13, ప్రభాతవార్త



2019, నుంచి 2024 వరకు పక్కాగృహాలు మంజూరై అసంపూర్తిగా ఉన్న ఇల్లుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు అధనంగా ఆర్థిక ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని ఈ అవకాశన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ జనార్ధన తెలిపారు. గురువారం విలేకర లో మాట్లాడుతూ గతంలో మంజూరై మధ్య ఆగిపోయినవి 254 గృహాలు ఉన్నాయని వీటిలో గుణాదులకు పరిమితం అయినవి 109 గోడలు వరకు వచ్చి గి పోయినవి 108 స్టాప్ వేసినవి 37 దశలో ఉన్నాయని వీటిని ఏప్రేల్ 20వ తేదిలోపు పూర్తి చేసుకొనేవారికి ప్రభుత్వం అదనంగా ఎస్సీ బీసీలకు 50వేలు ఎస్టీలకు 75వేలు రూపాయలు అదనంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పిఠాపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

మదనపల్లె క్రైమ్, మార్చ్ 13 ప్రభాతవార్త.



కాకినాడ జిల్లా పిఠాపురంలో శుక్రవారం నిర్వహించే పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జనసైనికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలంటూ జనసేన సీనియర్ నాయకులు తోట కళ్యాణ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఛలో పిఠాపురం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పిఠాపురంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా, పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిమ్మనపల్లి మండల జనసేన అధ్యక్షుడు ప్రదీప్ సింగ్, ప్రధాన కార్యదర్శి కిరణ్, అజయ్ కుమార్, సయ్యద్, మహేష్, గోపాల్, భరత్, గోపి, ప్రవీణ్ పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ లబ్దిదారులకు అదనపు సాయం

గాలివీడు, మార్చి 13(ప్రభాతవార్త):



గృహ నిర్మాణ లబ్దిదారులకు అదనపు సాయం అందిస్తున్నట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఉమ్మడిగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఎంఏవై-ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్దిదారులకు ప్రస్తుతం ఇంటి నిర్మాణం కొరకు ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనపు సాయంగా ఎస్సీ, బీసీ రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. గృహ నిర్మాణ లబ్దిదారులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా లబ్దిదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇల్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులను, ఇంజనీరింగ్ సిబ్బందిని ఆయన కోరారు. ఎవరైతే ఇంటి నిర్మాణాలను బీఎల్, ఆర్ఎల్, ఆర్సీ స్థాయిలో నిలిపివేశారో వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కొనడం అమ్మడం విషయంలో ప్రజలను, దుకాణదారులను ప్లాస్టిక్ వినియోగం వల్ల కలుగు నష్టాలను వివరించి చైతన్యపరచాలన్నారు. గాలివీడు మండలాన్ని ప్లాస్టిక్ రహిత మండలంగా జిల్లాలో నిలపాలని ఈఓపీఆర్డీ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ రమేష్‌నాయక్, ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సమ్మెపై మున్సిపల్ కార్మికులు కమీషనర్‌కు వినతి

మదనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :

సమస్యల పట్ల ఈనెల 17నుంచి మున్సిపల్ పారిశుద్యకార్మికులు సమ్మె చేపడుతుండడంతో గురువారం మున్సిపల్ కమీషనర్ ప్రమీలకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి మదనపల్లె అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌కుమార్, నాగరాజుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022నుంచి పారిశుద్యం విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పనిముట్లు ఇవ్వలేదని, ఉన్న పనిముట్లు మరమ్మత్తులు చేయక కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రెండేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న సోపులు, చెప్పులు ఇవ్వాలని, కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని తెలిపారు. కరోనా సమయంలో చేసిన వేతనాలు చెల్లించాలన్నారు. విధులు బహిష్కరించి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె విరమించమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి తిరుమలప్ప, నాయకులు వృద్విరాజ్, వంశీ, నాగరాజు, ఇంద్రాణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## ముగ్గురు దొంగలు అరెస్టు

నిమ్మనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త:



దొంగలను అరెస్టు చూపుతున్న దృశ్యం

నిమ్మనపల్లె మండలంలో రైతులకు గత రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పెట్టి కేబుల్‌వైరు రాత్రి సమయాల్లో చోరీలు జరిగాయి. ఈ చోరీలు అంగల్లుకు చెందిన చంద్ర శేఖర్, నాగార్జున అనే ఇద్దరిని గురువారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పే స్వామి తెలిపారు. అదే విధంగా వీరి వద్ద కేబుల్‌వైరు స్వాధీనం చేసుకొన్నామన్నారు. ఈ సందర్భంగా రైతులు ప్రతి ఒక్కరూ రాత్రి పూట వారి వారి పొలాల్లో జాగారం చేస్తున్న రైతులు ఎస్ఐకి ధన్యవాదాలు తెలిపారు.

## ఐదేళ్ళ నుంచి ఆగిన తాగునీరు

### ఎట్టకేలకు తాగునీరు అనందంలో సానుభూతిపరులు

నిమ్మనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయితీ ముతకనవారిపల్లెలో టిడిపి పార్టీ సానుభూతిపరులు ఇళ్ళకు తాగునీరు గత ప్రభుత్వం నిలుపదల చేసింది. చేసేదిలేక ఐదేళ్ళ నుంచి తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడిన వీరు కూటమి ప్రభుత్వం రాకతో దాదాపు 5నెలలు శ్రమించిన తరువాత నేడు స్థానిక ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి చొరవతో తాగునీటికి మోక్షం లభించింది. తాగునీరు శాశ్వితంగా పరిష్కరించడంతో ప్రజలతో పాటు టిడిపి సానుభూతిపరులు హర్షం వెల్లబుచ్చారు.

## 11వ పోలీస్ బెటాలియన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు

సిద్దవటం, మార్చి 13, ప్రభాతవార్త:

మండలంలోని 11వ బెటాలియన్ వద్ద గురువారం కమాండెంట్ ఆనందరెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 11వ బెటాలియన్ కమాండెంట్ కె.ఆనందరెడ్డి హాజరై ఈ కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని బెటాలియన్ ఏజీ-III గేట్‌కు బయటి వైపున మెయిన్ రోడ్డుకు పక్కన ప్రయాణికుల దాహార్తిని తీర్చుకొనుటకు ఈ చలివేంద్రం ఏర్పాటుకు అసిస్టెంట్ కమాండెంట్ పీఎన్‌డీ ప్రసాద్ సొంత నిధులతో ఏర్పాటు చేశారు. కమాండెంట్ మాట్లాడుతూ ఎండ తీవ్రత వలన ప్రజల సౌకర్యం నిమిత్తం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్లు పీఎన్‌డీ ప్రసాద్, ఎం.థియోఫిలాస్, కె.వెంకటరెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, ఏఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త;



మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్ భాష

స్థానిక పంచాయతీ కార్యాలయంలో వార్డ్ మెంబర్లతో కలిసి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ హబీబ్ భాషా మాట్లాడుతూ వేసవి కాలం మొదలైందని, పట్టణం లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డాక్టర్. హబీబ్ భాష అన్నారు. గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజల నుంచి సమస్యలు వస్తున్నాయని. పట్టణంలో డ్రైనేజ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీకి సంబంధించి. నీటి పన్ను ఇంటి పనులు కూడా. వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ చంద్రకళ, ప్రసాద్ రెడ్డి, బిల్ కలెక్టర్ మోహిత్ ,బాబ్జి, దీపిక అసిస్టెంట్ బిల్ కలెక్టర్ రవి, కిషోర్ ,దాదా పీర్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ షాప్ యజమానులకు కౌన్సెలింగ్

ముద్దనూరు, మార్చి 13, ప్రభాతవార్త:



కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం నాడు ముద్దనూరు పట్టణములోని మెడికల్ షాపుల యజమానులు మరియు ఆర్.ఎం.పి వైద్యులతో స్థానిక పోలీసు స్టేషన్ నందు సమావేశం నిర్వహించినట్లు సి ఐ దస్తగిరి తెలిపారు. వైద్యుల అనుమతి పత్రం లేనిదే సామాన్యులకు కొన్ని నిషేధిత ఔషధాలను అమ్మకూడదని ఒకవేళ అమ్మితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, కావున అందరూ తమకు సహకరించి ప్రభుత్వం నిబంధన మేరకే ప్రతి ఒక్కరూ వైద్యము మరియు విక్రయాలు జరపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మైనుద్దీన్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ల రూరల్, మార్చి 13 ప్రభాతవార్త:



పోరుమామిళ్లలోని చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో పోరుమామిళ్ల మండలంలో నిలా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకటాపురం నందు చదువుతున్న బాలబాలికలు 253 మందికి సంస్థ వ్యవస్థాపకులు చిత్తా తోమాస్ రెడ్డి, డాక్టర్. గీతా దంపతులు గురువారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధి ప్రసాద్ రెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చిన్న బహుమానంగా ఈ దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు కుటుంబానికి ఎంపీ ఆర్థిక సాయం

జమ్మలమడుగు, మార్చి 13, ప్రభాతవార్త:

మిర్చి పంట దిగుబడి రాక గత వారం కిందట ఆత్మహత్య చేసుకున్న మైలవరం మండలం దుగ్గనపల్లి గ్రామానికి చెందిన చీపాటలి మోషే కుటుంబ సభ్యులను గురువారం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పలకరించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వారి కుటుంబానికి వైఎస్ఆర్‌సీపీ తరుపున ఆర్థిక సాయం అందించినట్లు ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, గిరిధర్‌రెడ్డిలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నవాబుపేట, దుగ్గనపల్లి గ్రామ ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్న దాల్మియా యాజమాననయం వారు సమస్యలు పరిష్కారం కాకుండానే అదే ప్రాంతంలో హుటాహుటిన ప్లాంటు నందు 4.6 ఎంటీపీఏల నుంచి 12.6 ఎంపీటీపీఏలకు సిమెంటు ఉత్పత్తి పెంపుదలకై ఇంజినీర్ ప్రాంతీయ కార్యాలయం, కడప వారి ద్వారా నోటిఫికేషన్ ఇవ్వడం చాలా దారుణమని ఇప్పటికైనా కలెక్టర్, రెవెన్యూ శాఖ సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పబ్లిక్ హియరింగ్ నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. వరద ప్రవాహానికి నీట మునుగుతున్న పంట పొలాలను పరిశీలించారు.

## మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

వాల్మీకిపురం, మార్చి 13 ప్రభాతవార్త :



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

విజయవాడలో నిర్వహించే మహాధర్నాకు పెద్ద ఎత్తున పంచాయతీ కార్మికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర బాబు, కార్మికసంఘం నాయకుడు వెంకట్రామయ్యలు పిలుపు నిచ్చారు గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో జరిగిన కార్మికసమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, డిమాండ్ల సాధనకోసం ఈనెల 17వ తేదిన విజయవాడలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి పెద్దఎత్తున కార్మికులు హాజరవ్వాలని, తద్వారా మన సత్తా చాటాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. అంతకు మునుపు మహాధర్నా కరపత్రాలను విడుదల చేసి కార్మికులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు వెంకటేష్, శ్రీరాములు, భారతమ్మ, శ్రీనివాసులు, వసంతమ్మ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలి

వాల్మీకిపురం, మార్చి 13 ప్రభాతవార్త :

మండలంలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణ లబ్దిదారులకు ప్రభుత్వం అదనపు సహాయం మంజూరు చేసినట్లు ఎంపీడీవో మనోహర్రాజు గురువారం తెలిపారు. మండలంలో గతంలో గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన ఇళ్ల లబ్దిదారులు ఆర్థికస్తోమత లేకుండా అసంపూర్తిగా నిర్మాణాలను వది లేసిన లబ్దిదారులను గుర్తించి వారు త్వరిత గతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా ప్రభుత్వం అదనపు సాయం మంజూరు చేసిందన్నారు. మండలంలో 14 మంది ఎస్టీలకు ఒక్కొక్కరికి రూ.75 వేలు, అలాగే 156 మంది ఎస్సీలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీరితో పాటు 29 మంది బీసీలకు సైతం ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున అదనపు సాయం మంజూనైనట్లు ఎంపీడీవో తెలిపారు ఈ అవకాశాన్ని ఎస్టీ, ఎస్సీ, బీసీలు సద్వినియోగం చేసుకొని లబ్దిపొందాలని ఎంపీడీవో సూచించారు.

## శ్రీ రాజీవ్ హైస్కూల్‌లో ఫేర్ వెల్ డే సంబరాలు

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 13 ప్రభాతవార్త :



స్థానిక గురువయ్య తోటలోని శ్రీ రాజీవ్ హైస్కూల్లో గురువారం ఫేర్వెల్ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ముక్క మల్ల సుధాకర్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు ఫేర్వెల్ డే సందర్భంగా విద్యార్థులు లక్ష్యం వైపు అడుగులు వేస్తూ సమాజంలో తల్లిదండ్రులకు మంచి పేరుతో పాటు ఉన్నత స్థాయిలో ఉండాలని తెలిపారు. స్కూల్ చైర్మన్ అనుమల వెంకట రాజేష్ మాట్లాడుతూ విద్యార్థి దశలో స్కూలు స్థాయిలో క్రమశిక్షణతో మంచి ఆలోచన ధోరణిలో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్వైజర్ అనుముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సినిమా, క్రికెట్, సెల్ ఫోన్ చూడకుండా మూడు వ్యసనాల బారిన పడకుండా చదువు మీద శ్రద్ధతో చదివితే ఉన్నత స్థాయిలో ఉంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ టెస్సి ఉపాధ్యాయులు సుధా, రాధిక,ప్రియాంక, రమణమ్మ, దయానా, అనిత,మాధవి, గాయత్రీ, స్పందన,సల్మా, ఫాతిమా, రమేష్, రఘునాథ్, దాదా పీర్, షేక్షావలి, మహమ్మద్, శ్రీను, బాల నరసింహులు, ప్రసాద్, అశోక్, నరసింహ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాఠశాలలలో మత్తు పదార్థాల నివారణే లక్ష్యం

ముద్దనూరు, మార్చి 13, ప్రభాతవార్త:

మండలంలోని పాఠశాలలో మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో 9 మంది సభ్యులతో కూడిన ఈగల్ క్ల బ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. గురువారం బాలురుగా ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఈగల్ క్లబ్ ఆవశ్యకతను వివరించారు. క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎనిమిది మంది ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల విద్యార్థుల నడవడికలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మాదకద్రవ్యాల అలవాటు పడుతున్నారా, అలా ఎవరైనా విద్యార్థులు ఉంటే వారికి మాదగ ద్రవ్యాల పై అవగాహన కల్పించి, వాటి జోలికి వెళితే కలిగే పర్యవసనాలను వివరించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో, ఇతర ఖాళీ ప్రదేశాలలో ఈవ్ టీజింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులలో ఎటువంటి మార్పు లేకపోతే కేసులు నమోదు చేయించి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా వారిని మేల్కొల్పే విధంగా ఈగల్ క్లబ్ పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజబాబు పిఈటి మాధవరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటుకి ఎమ్మెల్యే చొరవ

ఖాజీపేట, మార్చి 13, ప్రభాతవార్త:

మైదుకూరు నియోజికవర్గ అభివృద్ధికి పక్కా ప్రణాళికలతో ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ముందుకు వెళుతున్నారని ఖాజీపేట తెలుగుదేశం మండల యువ నాయకులు సోమల త్రివిక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో జవహర్ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలని అది కూడ మైదుకూరు నియోజకవర్గంలో ఏర్పాటుచేయాలని రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారని దీనిపై జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటుకు కావాల్సిన స్థలం, భవనాలు తదితర అంశాలపై పూర్తి స్థాయి నివేదికను పంపాలని పాఠశాల విద్యాశాఖ కమీషనర్ విజయరామరాజు కడప కలెక్టర్‌ను ఆదేశించారని తెలిపారు.

## 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దువ్వూరు, మార్చి 13, ప్రభాతవార్త:

ఈ నెల 17వ తేది ప్రారంభం అయ్యే 10వ తరగతి పరీక్షలకు మూడు పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి పద్మలత తెలిపారు. మండలంలోని 7జిల్లా పరిషత్ హైస్కూల్లు, నాలుగు ప్రైమరీ పాఠశాల విధ్యార్థులకు మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. దువ్వూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 186మంది, పుల్లారెడ్డి పేట హైస్కూల్ నందు 180, కస్తూరిబా పాఠశాల నందు 96మంది విధ్యార్థిని, విధ్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 10వ తరగతికి సంబంధించిన ప్రశ్నాపత్రాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరాయన్నారు. 10వ తరగతి పరీక్షలకు కావాల్సి న బల్లలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దువ్వూరు, మార్చి 13, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఐ.బయనపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంజనేయులు గాయపడ్డాడు. ఐ.బయనపల్లెకు చెందిన ఆంజనేయులు దువ్వూరుకు పని మీద వచ్చి తిరిగి వెళ్తుండగా బయనపల్లె రోడ్డుకు క్రాస్ చేస్తుండగా ఆళ్లగడ్డ నుండి దువ్వూరు వైపుకు వస్తున్న కారు అతి వేగంగా ఢీ కొంది. దీంతో మోటార్ సైకిల్ పై వెళ్తున్న ఆంజనేయులుకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి

బద్వేలు, మార్చి 13 (ప్రభాతవార్త):

బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన కూరగాయల మార్కెట్ బహిరంగ వేలంపాటలో కమిషనర్ మాట్లాడుతూ మార్కెట్ వేలంపాట ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందన్నారు. కూరగాయల మార్కెట్‌కు 19,03,000/-లు, పొట్టేళ్లు, మేకల సంతను రూ.1,62,000/-లు మాంసం, చేపల మార్కెట్‌పై ఎవరూ ఆసక్తి చూపనందున ఈ నెల 19వ తేదికి వాయిదా వేశారు.

## వీ పి ఆర్ కండ్రిక పిఎసిఎస్ అధ్యక్షులుగా డీకే ఆర్

రైల్వే కోడూరు మార్చి 13 ప్రభాత వార్త....

మండలంలోని వీ పి ఆర్ కండ్రిక సొసైటీ అధ్యక్షులుగా డి కృష్ణంరాజును ఎన్నుకున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఎంతోకాలంగా ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఎట్టకేలకు తెలుగుదేశం పార్టీ వీరాభిమాని కృష్ణంరాజును ఎన్నుకున్నారు. ఈయన ఆది నుండి తెలుగుదేశం పార్టీకి వెన్నంటి ఉండి పార్టీకి సేవలు అందించారు. ఆయన సేవలు గుర్తించి వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

## డాక్యుమెంట్ పోయినది

కలుట్ల అబ్దుల్ అజీస్ తండ్రి కె ఖాజా హుస్సేన్, అడ్రస్ 15/228, దస్తగిరి పేట, పొద్దుటూరు టౌన్ మరియు (మం)వైఎస్ఆర్ కడప (జిల్లా)ఏ.పీ., నా ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ పోయినది నెంబర్: 12774/2022 దొరికిన వారు పై అడ్రస్ కు తెలియజేయగలరు.

## ఆవిర్భావ దినోత్సవానికి తరలిన కార్యకర్తలు

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త :



పిఠాపురంకు తరలిన జనసేన కార్యకర్తలు

పిఠాపురంలో జరగనున్న 12వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కలప రవి ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గ 6 మండలాల నుండి భారీగా తరలి వెళ్ళిన జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కార్యదర్శి కలప రవి మాట్లాడుతూ రేపు జరగనున్న 12వ ఆవిర్భావ దినోత్సవం మహాసభ జయప్రదం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వాల్మీకిపురం నుండి రెడ్డప్ప ప్రభాకర్ కలికిరి నుండి జబ్బీర్, కెవి పల్లి నుంచి అశోక్, పీలేరు నుంచి నరేష్, ఆనంద అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలు 15 టెంపుల్ ట్రావెల్స్, కార్లలో పీలేరు నుండి భారీగా తరలి వెళ్లారు.

## పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన సదస్సు

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త :

కలికిరి జేఎన్టీయూ కళాశాలలో పుట్టగొడుగుల పెంపకంపై సిఈకేలోని ఫుడ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ మరియు ఆరన్ సైంటిఫిక్ మదనపల్లి వారి ఆధ్వర్యంలో మష్రూమ్ కల్టివేషన్ వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం. వెంకటరమణ, వైస్ ప్రిన్సిపల్ త్యాగరాజన్, ఫౌండర్ డాక్టర్ ఎన్ నందకిషోర్ ,విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగులకు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతుందని మష్రూమ్ కల్టివేషన్ పై అవగాహన పెంచుతుందన్నారు. మష్రూమ్ యొక్క ప్రయోజనములను పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ విభాగం అధ్యాపకులు ఎం కీర్తి, ఎం అఖిల, ఎం మోనిక, కే వినయ్ ప్రమోద్ ఏ శిబారాణి తదితరులు పాల్గొన్నారు.

## మే నెల వరకు పూర్తి చేయండి

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

అన్నమయ్య జిల్లా పీలేరులో గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు మంజూరైన ఇండ్లు 2025 మే నెలకు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ రమణయ్య,పీలేరు ఎంపీడీవో శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో మండలంలోని గ్రామపంచాయతీ పరిధిలో బిసి ఎస్టి ఎస్సి లకు హౌసింగ్ లిస్ట్ లో సాంక్షన్‌లో ఉన్న గృహ నిర్మాణానికి అదనంగా ప్రభుత్వం పైకము చెల్లించనిందని తెలిపారు. 2025 మే నెలకు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం అదనంగా అందించనుందని గృహ నిర్మాణాలు పూర్తిచేయని లబ్ధిదారులకు అదనంగా వచ్చేడబ్బు చెల్లించబడదని తెలిపారు. అందులో భాగంగా ఎస్సీలకు 264, ఎస్టీలకు 144, బీసీలకు 1371 మొత్తం కలిపి 1779 హౌసింగ్ సాంక్షన్ లిస్టు లో పీలేరు మండలంలో గ్రామాలలో ఉన్నాయని వారు ఇచ్చిన గడువు లోపల ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

## ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

రామసముద్రం మార్చి 13 ప్రభాతవార్త

మండలంలోని ఊలపాడు పంచాయతి దిన్ని పల్లెసమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో 2025,26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ప్రవేశ ప్రక్రియకు సంబంధించి మార్చి 17 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభంకానుందని22.5.2025 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ తెలిపారు. ప్రస్తుతం పదవతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చుఅని ఆయన తెలిపారు. పదవ తరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్లు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు. విద్యార్థులు నిర్ణీత తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సూచించారు. దరఖాస్తు ఫీజు కింద ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ. 200. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో సీట్లు పొందినవారికి ఉచిత విద్య అందిస్తారు. ఈ ఆదర్శ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో ఇంటర్ విద్య బోధిస్తామన్నారు.

## పట్టణంలో పలుచోట్ల విద్యుత్ అంతరాయం

యర్రగుంట్ల మార్చి 13 ప్రభాతవార్త

పట్టణ పరిధిలో రెండో శుక్రవారం విద్యుత్ మెయింటెనెన్స్ లో భాగంగా పట్టణంలోని ముద్దనూరు రోడ్డు కడప రోడ్డు వేంపల్లి రోడ్డు రానివణం, వినాయక నగర్ ,సుందరయ్య నగర్, ప్రొద్దుటూరు రోడ్డు, మరియు ఎస్టేట్ పరిసర ప్రాంతాలలో ఉదయం 8:30 నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని, పట్టణ ప్రజలు సహకరించాలని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రియదర్శన్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు.

## ఇన్చార్జ్ ఎంపిడివోగా ఉషారాణి

లక్కిరెడ్డిపల్లె; మార్చి 13, ప్రభాతవార్త

ఇన్చార్జీ ఎంపిడివోగా లక్కిరెడ్డిపల్లె ఈఓపీఆర్డిగా పనిచేస్తున్న ఉషారాణికి గురువారం భాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడివో రెడ్డెయ్య ఒంటిమిట్ట మండలంలో జరిగిన నిధుల గోల్ మాల్ లో ఆయనను సస్పెండ్ చేశారు. ఈ మేరక ఉషారాణిని ఇన్చార్జీ ఎంపిడివోగా బాధ్యతలు అప్పగించినట్లు ఉషారాణి తెలిపారు.

## నేడే శ్రీకొండాశింగరాయస్వామి ఆరాధన ఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం మార్చి 13 ప్రభాతవార్త

బ్రహ్మంగారిమఠం నుండి మిట్టామానుపల్లె మార్గ మధ్యములో నెలకొని వున్న త్రికాల వేది, మహా మహిమోన్నత యోగులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కొండా శింగరాయస్వామి వారి ఆరాధనోత్సవములు ప్రతి ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి పర్వదినమున ఉత్సవములు భక్తజనుల సహకారములతో వైభవముగా జరుగుచుండును. అటులనే ఈ స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ క్రోధి నామ సంవత్సర ఫాల్గుణ మాస శుద్ధ పౌర్ణమి సరియగు తేది 14 వ తేదిన శుక్రవారము ఆరాధనోత్సవ శుభదినమున శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కొండా శింగరాయస్వామి వారి సన్నిధిలో నిర్వహించు విశేష అభిషేకము, ప్రత్యేక పూజలు, హరిభజన అన్నదానము మొదలగు కార్యక్రమములలో భక్తాదులందరు పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి శ్రీ స్వాములవారి కృపాకటాక్ష వీక్షణములు పొంది తరించగలరని కోరుచున్నాము.

## క్షయవ్యాధిగ్రస్తులను ఆదరిద్దాం

లక్కిరెడ్డిపల్లె; మార్చి 13, ప్రభాతవార్త



అవగాహన కల్పిస్తున్న సూపర్వేజర్ హరి

క్షయవ్యాధిగస్తులను వెలివేయకుండా వారిని ఆదరించాలని క్షయవ్యాధి నివారణ సూపర్వేజర్ హరి పేర్కొన్నారు. క్షయ వ్యాధి వారోత్సవాలల్లో భాగంగా గురువారం స్థానిక నలంద హైస్కూల్లో క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తుడు తుమ్మిన, దగ్గిన గాలినుంచి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతున్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం 6నెలలకు సంబందించిన మందులు ఉచితంగా అందిస్తుందన్నారు.అంతేకాకుండా క్షయ. వ్యాధి గ్రస్తులు ఆరోగ్యాంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రతి నెల పౌష్టిక ఆహారం కొరకు 1000 రూపాలు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపద్యాయుడు బా లసుబ్రమణ్యం, కరస్పాండెంట్ చిన్నరమణ, రమణ ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిఠాపురం చిత్రాడ సభకు జనసేన నాయకులు

రామసముద్రం మార్చి 13 ప్రభాతవార్త

జనసేన పార్టీ ఆవిర్భవ దినోత్సవానికి మండలం నుండి జనసేన నాయకులు పిఠాపురంకు దారం అనిత ఆధ్వర్యంలో వాహనాలు ద్వారా గురువారం మదనపల్లి నుండి బయలుదేరారు. బయలుదేరిన జనసేన నాయకులు జనసేన సూరి సురేష్, శంకరప్ప రెడ్డెప్ప, హరినాథ్, రంగప్ప, ఆనంద, నారాయణ, శంకరప్ప తదితరులు బయలుదేరారు.

## చిత్రాడకు భారీగా వెళ్లిన జనసేన నాయకులు

జమ్మలమడుగు, మార్చి 13, ప్రభాతవార్త:

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి జమ్మలమడుగు జనసేన పార్టీ ఇన్ఛార్జి నల్లంశెట్టి నాగార్జున ఆధ్వర్యంలో భారీగా బయలుదేరారు. గురువారం నాగార్జున పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ 12వ ఆవిర్భావ దినోత్సవం మాకు ఒక పండగ అన్నారు. 15 రోజుల ముందే తెలుగువారి ఉగాది నేడు పిఠాపురంలోని చిత్రాడలో చూడబోతున్నామన్నారు. జమ్మలమడుగు నుంచి 2 బస్సుల్లో బయలుదేరుతున్నామని తెలిపారు. ఇది మాకు విజయోత్సవం అన్నారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, కొండాపురం, ముద్దనూరు మండలాల అధ్యక్షులు పవన్‌కుమార్, కాటమ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

కలికిరి, మార్చి 13, ప్రభాతవార్త:



పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి గురువారం పీలేరు పంచాయతీ కార్యాలయం ఆవరణలో పంచాయతీ ఈవో అశోక్, తెదేపా యువ నాయకుడు రెడ్డివారియోగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు పాలాభిషేకం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్నా పాలకులు, అధికారులు తమ సేవలను గుర్తించిన పాపాన పోలేదు. చాలీ చాలని వేతనాలతో కుటుంబ పోషణ సాగిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో పంచాయతీ కార్మికుల బాధలను గుర్తించిన పేదల పక్షపాతి అయిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి ఆదుకోవాలని ప్రస్తావించడంపై పంచాయతీ కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గురువారం ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## అతికారి కృష్ణ ఆధ్వర్యంలో చలో పిఠాపురం

సిద్ధవటం, మార్చి 13, ప్రభాతవార్త:



పిఠాపురంలో శుక్రవారం జరగబోయే ఆవిర్భావ సభకు రాజంపేట పార్లమెంటు సమన్వయ కర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో పార్లమెంటు పరిధిలో 6 నియోజకవర్గాల నుంచి 50 బస్సులు 200 కార్లతో 2వేల మందితో కలిసి సిద్ధవటం మీదుగా పిఠాపురానికి కార్యకర్తలు బయలుదేరారు. ఈ సందర్భంగా బీగాల సుబ్రమణ్యం మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ కోసం మేము నిరంతరం కష్టపడుతుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చలపాటి చంద్ర, గంజి సుబ్బరాయుడు, శ్రీకాంత్, మహబూబ్ బాషా, విజయ్‌కుమార్, జగన్‌మోహన్‌రెడ్డి, విద్యా కమిటీ ఛైర్మన్ నాగార్జున, మందపల్లి ప్రభు, పెద్ద ఎత్తున జనసేన నాయకులు వీర, మహిళలు బయలుదేరి వెళ్లారు.

## కేంద్ర మంత్రులను కలిసిన ఎమ్మెల్యే, ఎన్‌డీఏ కూటమి ఇన్‌ఛార్జిలు



జమ్మలమడుగు, మార్చి 13, ప్రభాతవార్త:

బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలంలో ఉన్న శ్రీశ్రీ అవధూత కాశినాయన దేవాలయం ప్రాంగణంలో ఉన్న అన్న సత్రాల నిర్మాణాల అనుమతుల కోసం గురువారం ఢిల్లీలో పర్యావరణ శాఖమంత్రి భూపేందర్ యాదవ్‌ను అలాగే ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు శ్రీమతి పురంధేశ్వరిని జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంటు ఎన్‌డీఏ కూటమి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డిలు దేవాలయం ప్రాముఖ్యతను, విశిష్టతను వివరించారు. కేంద్ర మంత్రులను కలిసిన వారిలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగళ శశిభూషణ్‌రెడ్డి, కడప పార్లమెంటు బీజేపీ ఇన్‌ఛార్జి బొమ్మన సుబ్బరాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## దేవాదాయశాఖ భూములను కాపాడండి

### జిల్లా ఎండోమెంట్ అధికారికి బివైఎస్ విన్నపం

మదనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నియోజకవర్గంలో అన్యాక్రాంతం అవుతున్న దేవాదాయశాఖ భూములను కాపాడాలంటూ బివైఎస్ అధ్యక్షులు పునిత్ జిల్లా దేవాదాయశాఖ అధికారికి గురువారం విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న దేవాదాయశాఖ పరిధిలో ఉన్న కోట్లాదిరుపాయల భూములు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారన్నారు. అక్రమంగా నిర్మాణాలు, బంకులు ఏర్పాటు చేసుకొని దేవాదాయశాఖకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారన్నారు. అంతేకాకుండా దేవాలయ భూముల్లో కోట్లు విలువ చేసే ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకొంటున్నారన్నారు. దేవాదాయ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి నివాసాలు ఉంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిలాని బాషా, శ్రీనాథ్, జగదీష్, వెంకటేష్, జశ్వంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలో చేరిన వైకాపా నాయకులు

మదనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :



పార్టీలో చేరిన దృశ్యం

పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన వైకాపా నాయకులు బండి మనోహర్ గురువారం మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. ఆయన చేత జనసేన పార్టీ కండువా కప్పుకొని, పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. ఆయనతో పాటు 30మంది వైకాపా కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండి మనోహర్ మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు, ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపకులు పవన్‌కళ్యాణ్ అకుంటిత దీక్ష చూసి జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు. బండిమనోహర్ సోదరి కోళ్ళబైలు వైఎస్ఆర్‌కాలనీ గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా కూడా ఉంటున్నారు. వీరికి నీరుగట్టువారిపల్లె, కోళ్ళబైలు గ్రామాల్లో బలమైన అనుచరవర్గం ఉంది.

## అనాధ శవానికి హెల్పింగ్‌మైండ్స్‌చే అంత్యక్రియలు

మదనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :



అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెలుతున్న దృశ్యం

అనాధ శవానికి హెల్పింగ్‌మైండ్స్, చైతన్య సర్వీస్ సొసైటిలచే గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. అనాధగా ఉన్న వృద్ధుడు చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థలో ఆశ్రయం పొందుతూ అనారోగ్య కారణంగా మృతి చెందాడు. దీంతో హెల్పింగ్‌మైండ్స్, చైతన్య సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకొన్నారు. ఈకార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబుబక్కర్ సిద్దిక్, చైతన్య సర్వీస్ సెంటర్ వ్యవస్థాపకులు ఎంపి.ఆనందన్, జనరల్ సెక్రటరీ కవితారాణి, జీవిఎస్.బాబు, హెల్పింగ్‌మైండ్స్ సంస్థ సభ్యులు హనీఫ్, కిరణ్, చరణ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నిలబెట్టుకోలేని కూటమి ప్రభుత్వం

ముద్దనూరు, మార్చి 13,ప్రభాతవార్త:



సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసి రెడ్డి అన్నారు. గురువారం ముద్దనూరులో తులసిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలలో భాగంగా నిరుద్యోగ భృతి క్రింద నెలకు రూ 3వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు పైసా ఇవ్వలేదు అన్నారు. తల్లికి వందనం పథకం క్రింద ఇప్పటివరకు పైసా ఇవ్వలేదు. అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పాముల బ్రహ్మానంద రెడ్డి, పెద్దముడియం మండల శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్, ఓబయ్య,బషీర్,రాం రెడ్డి,మహబూబ్ పీర్,అమర్ నాథ్ రెడ్డి,ఉత్తన్న,వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## 75 వేల అదనంగా ఆర్థిక సాయం

పెద్దమండెం మార్చి 13 ప్రభాతవార్త

2019 నుండి 24 వరకు పెండింగ్లో ఉన్న హౌసింగ్ ఇండ్లకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం అధికంగా నిధులను అందిస్తుంది బీసీ ఎస్సీలకు 50 వేల రూపాయలు మరియు ఎస్టీలకు 75 వేల రూపాయలను ఆర్థిక సాయాన్ని అదనంగా అందిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ అక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు కావున లబ్దిదారులు పెండింగ్లో ఉన్న ఇండ్లను త్వరితగతిన ఏప్రిల్ చివరి మాసంలోగా పూర్తి చేయాలని కోరారు అధిక భారంతో నిర్మాణాలకు నోచకోని ఇంటి నిర్మాణాల కోసం కూటమి ప్రభుత్వం చేయూతనిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు కావున వివిధ కారణాలవల్ల ఆగిన ఇండ్లను పూర్తి చేసి ప్రభుత్వ సాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు ఈ అవకాశాన్ని మండల ప్రజలు హౌసింగ్ లబ్ధిదారులు పొందాలని తెలిపారు.

## పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించండి

యర్రగుంట్ల మార్చి 13 ప్రభాతవార్త



కృత్రిమ గర్భధారణతో జన్యుపరంగా ఆరోగ్యవంతమైన మేలు జాతి లేగ దూడలు జన్మిస్తాయని పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి మునెయ్య పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కర్చుకుంటపల్లె గ్రామంలో కడప పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పాడి పశువులకు తప్పనిసరిగా ఎదసూదులు వేసుకోవాలని సూచించారు. ప్రదర్శనలో 35 లేక దూడలు పాల్గొనగా మేలు జాతి లక్షణాలు ఉన్న లేగదొడల యజమానులకు మొదటి మూడు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య డాక్టర్లు మహేశ్వర్ రెడ్డి, శివరామిరెడ్డి, శరత్ కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుమలత లతోపాటు నాయకులు పాడి రైతులు పాల్గొన్నారు.

## రక్షణ కోసం పోలీసులు ఆశ్రయించిన ప్రేమ జంట

మదనపల్లి క్రైమ్, మార్చి 13 ప్రభాతవార్త.



ఇంట్లో నుంచి వెళ్ళిపోయి పెళ్లి చేసుకున్న ఓ ప్రేమ జంట రక్షణ కోసం రెండో పట్టణ పోలీసులు ఆశ్రయించిన సంఘటన గురువారం మదనపల్లిలో చోటుచేసుకుంది. ప్రేమ జంట కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లి రూరల్ మండలం వేంపల్లి పంచాయతీ నల్లగుట్టపల్లికు చెందిన లేట్ చలపతి కుమారుడు సతీష్(22) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మదనపల్లి పట్టణం చంద్ర కాలనీకి చెందిన స్వాతి (22) బిఎస్సి నర్సింగ్ పూర్తి చేసి ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో పనిచేస్తుంది. వీరిద్దరూ ఏడాదన్నారగా ప్రేమించుకుంటున్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయి గుడిలో వివాహం చేసుకున్నారు. అనంతరం తమ కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలంటూ రెండవ పట్టణ పోలీసులు ఆశ్రయించారు.

## అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవ వేడుకలు

మదనపల్లి క్రైమ్, మార్చి 13 ప్రభాతవార్త.



అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవ వేడుకలను మదనపల్లి జిల్లా ఆసుపత్రి డయాలసిస్ కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మెడికల్ సూపరింటెండెంట్ కోటేశ్వరి, డయాలసిస్ మెడికల్ ఆఫీసర్ శాశ్వతిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి కిడ్నీలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐదు జాగ్రత్తలు పాటిస్తే తమ కిడ్నీలు పాడు కాకుండా కాపాడు కోవచ్చనన్నారు. బిపి, షుగర్, మద్యం, జంక్‌పుడు, స్మోకింగ్ జోలికి వెళ్లకపోతే కిడ్నీ పదిలంగా ఉంటుందన్నారు. కిడ్నీ పాడైపోతే డయాలసిస్ తప్ప కిడ్నీ మార్పిడి సామాన్యులకు సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో డయాలసిస్ ఇంచార్జ్ బాలు, వైద్య సిబ్బంది, డయాలసిస్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీబీ లేని సమాజ నిర్మాణం అవగాహనతోనే సాధ్యం

రాజంపేట అర్బన్ మార్చి 13 ప్రభాతవార్త



టీబీ లేని సమాజ నిర్మాణం అవగాహన తోనే సాధ్యమని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సానే శేఖర్ అన్నారు. టీబీ పరివేక్షులు జయప్రకాశ్ అన్నారు. టీబీ వ్యాధి అవగాహన మాసోత్సవాలలో భాగంగా గురువారం రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఉర్దు హై స్కూల్ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహనా కలిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలకు పై బడి దగ్గు, రాత్రి పూట జ్వరం రావడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, గళ్ళలో రక్తం పడటం ఇటువంటి లక్షణాలు ఉంటే టీబీ వ్యాధి అని అనుమానించాలాన్నారు. ఆశ కార్యకర్తలు సంప్రదించి ప్రభుత్వ హాస్పిటల్‌లో గల్ల పరీక్ష చేయించాలన్నారు. టీబీ వ్యాధి ఒకరి నుండి మరొకరికి నోటి తుంపర్లు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఒకవేళ వ్యాధి ఉందని నిర్ధారణ అయితే 6 మాసాలు మందులు పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం అందచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్వైజర్ జయ ప్రకాష్, అప్తమాలిస్ట్ ఓబులేష్, సీనియర్ క్లర్క్ సిదిరామయ్య, ల్యాబ్ సూపర్వైసోర్ మల్లికార్జున, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజుపాళెం, మార్చి13, ప్రభాతవార్త.

మండల కేంద్రమైె రాజుపాళెం గ్రామంలోని పెట్రోల్ బంకు దగ్గర గురువారం ఉదయం రెండు మోటారుసైకిల్లు డీకొన్న సంఘటనలో సుంకుప్రసాదు (56) అనే వ్యక్తి మృతిచెందాడు. ఈవిషయమై ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.వివరాలలోకి వెళ్ళితే గాదెగూడూరు గ్రామానికి చెందిన మృతుడు ప్రసాదు మోటారుసైకిల్లో ప్రొద్దుటూరుకు వెళ్లుతున్న సమయంలో రాజుపాళెం పెట్రోల్ బంకు దగ్గరకు రాగానే ఎదురుగా వస్తున్న టంగుటూరు గ్రామానికి చెందిన కాసా వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తి మోటారుసైకిల్‌లో వెంగళాయపల్లెకు వెళ్లుతూ పెట్రోలు బంకు వైపుకు మలుపు తిప్పటంతో రెండు మోటారుసైకిళ్ళ డీకొనటంతో ప్రసాదుకు తీవ్రగాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించు క్రమంలో మార్గమద్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమార్తె ఉన్నారు.

## వైద్య విద్యను భ్రష్టు పట్టించిన జగన్



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )

రాష్ట్రంలో వైద్య విద్యను జగన్మోహన్ రెడ్డి భ్రష్టు పట్టించారని, ఫలితంగా 2500 వైద్య సీట్లు కోల్పోవాల్సి వచ్చిందని రాజంపేట బిజెపి కార్యాలయంలో గురువారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతుగుంట రమేష్ నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి అప్పుల రెడ్డిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఇప్పుడేమో మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యపట్టారు. మోదీ ప్రభుత్వం ఏపి కి 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేసి, గ్రాంట్లు, రుణ రూపంలో రూ. 4900 కోట్లు ఇస్తే, చేతకాని సీఎం పులివెందులతో సహా, ఒక్క కాలేజీకి కావలసిన వసతులు పూర్తి చెయ్యలేదన్నారు. ఖర్చు పెట్టాల్సిన మొత్తం రూ. 8480 కోట్లలో కేవలం 15 మాత్రమే నాలుగేళ్లలో ఖర్చు చేసి మిగిలిన నిధులను దారి మళ్లించారన్నారు. ఈ కారణంగా రాష్ట్రం 2500 సీట్లు కోల్పోయే మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్నారు. నాలుగేళ్లలో గుర్రం నాడా మాత్రం తెచ్చి, ఏడాదిలో గుర్రం ఎందుకు తేలేదని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. ఇది జగన్ ప్రభుత్వ నిర్వాకమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ అధ్యక్షులు వివి రమణ, పట్టణ ప్రధాన కార్యదర్శి జీకే నాగరాజు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

కలకడ, మార్చి 13 ప్రభాతవార్త:



పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి పంచాయతీ కార్మికులు పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో పంచాయతీ కార్మికుల సేవలో లేకపోతే ఎక్కడ చెత్త అక్కడే ఎక్కడి మురికి నీరు అక్కడే నిలువు ఉండి దుర్గంధ భరితంగా మారి, గ్రామాలు రోగాలతో పల్లడిల్లేవని తెలియజేశారు. వారి ఆరోగ్యాలు కూడా లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్య కోసం పాటుపడుతున్న పంచాయతీ కార్మికుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు చొరవ తీసుకుని కార్మికులకు జీతాలు పెంచవలసిన అవసరం ఉందని అసెంబ్లీలో విన్నవించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కలకడ మండల పంచాయతీ కార్మికులు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలకడ టౌన్ ఇంచార్జి జిలాని భాష, జాఫర్ సేమ్ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన

కలకడ మార్చి 13 ప్రభాతవార్త:



మాట్లాడుతున్న ఎంపీడీవో అబ్దుల్ రహీం

హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019, 24 సంవత్సరముల మధ్యలో మంజూరైన ఇండ్లకు సంబంధించి నిరుపేదలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేక సతమతమవుతున్న పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఎస్సీ, బీసీలకు 50 వేల రూపాయలు, ఎస్టీలకు 75 వేల రూపాయలు అదనంగా ఇవ్వడం జరుగుతుందని దీని ద్వారా ఇళ్ల నిర్మాణాలను పూర్తిస్థాయిలో నిర్మించుకోవడానికి వీలవుతుందని కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. మండలంలో ఎస్సీలకు 37 ఎస్టీలకు 9 బీసీలకు 136 గృహాలు మంజూరయ్యాని ఈ నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయని వీరికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లించడం జరుగుతుందని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నాగ ముని నాయక్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సుల కండిషన్ పరిశీలన

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త :



బస్సుల కండిషన్ పరిశీలిస్తున్న అధికారి రాము

ఆర్టీసీ బస్సుల కండిషన్ సక్రమంగా ఉందా లేదా అని అన్నమయ్య జిల్లా ప్రజా రవాణా అధికారి పి.రాము పరిశీలించారు. గురువారం రాయచోటి నుండి పీలేరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కలకడ సమీపంలో నిలిపి తనిఖీలు నిర్వహించినట్లు పీలేరు డిపో మేనేజర్ నిర్మల తెలిపారు. బస్సు గతంలో ఎన్ని కిలోమీటర్లు తిరిగింది..? దాని పరిస్థితులు ఎలా ఉన్నాయి..? ఇంజన్ కండిషన్ ఎలా ఉంది..? అన్న అంశాలపై ఆర్టీసీ మెకానిక్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రతినెల బస్సులు కండిషన్ పై ఆరా తీయడం జరుగుతుందని అలా చేయడం వల్ల ప్రయాణికులను చేరవేసేందుకు ఆర్టీసీ బస్సులు స్థితిగతులు ఎలా ఉన్నాయి, తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ మేనేజర్ సుబ్బమ్మ, పీలేరు ఆర్టీసీ సిబ్బంది, మెకానిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవానికి కార్యకర్తలు

పెద్దమండెం మార్చి 13 ప్రభాతవార్త



పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి మండలం నుంచి కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు నేడు పిఠాపురంలో జరగనున్న ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనేందుకు నియోజకవర్గం జనసేన అధ్యక్షులు పోతుల సాయినాథ్ ఆధ్వర్యంలో ప్రయాణమయ్యారు. గత ప్రభుత్వంలో పంచాయతీకి నిధులు లేక అభివృద్ధికి నోచుకోలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని జనసేన నాయకులు అక్షరాఫ్ నాగూర్ వలి ధనుంజయ జయప్రకాష్ హర్ష భాను ప్రకాష్ రెడ్డప్ప తదితరులు అధిక సంఖ్యలో బయలుదేరారు

## వేతనాలను పెంపు కోసం వినతి

కడప కార్పొరేషన్ మార్చి 13 ప్రభాతవార్త:



కడప నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా మా వేతనాలు మాత్రం పెరగలేదని చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని అవుట్సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులు ఎస్.ఎండి.ఖాసీం, అజాముద్దీన్, రామసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కడప నగరపాలక సంస్థ అడిషనల్ కమీషనర్ రాకేష్ చంద్రకు వినితి పత్రము ఇచ్చారు. ఇందుకు సానుకూలంగా స్పందిస్తూ కమిషనర్ మనోజ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. అడిషనల్ కమిషనర్‌ను కలిసిన వారిలో రమేష్, ఎస్వి.రమణ తదితర ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు.

### శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# నేషనల్ లెవెల్ టెక్ ఫెస్ట్ సాయి నైపుణ్య 2కే25 నిర్వహణ



**రాయచోటి మార్చి 13 ప్రభాత వార్త**

రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నేషనల్ లెవెల్ టెక్నికల్ ఫెస్ట్ సాయి నైపుణ్య 2కే 25 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్.కే. అపర్ణ, ఎలక్ట్రానిక్ సమీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, జేఎన్టీయూ కలికిరి, విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ వి. వెంకట రమణ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అధిపతి, కే ఎస్ ఆర్ ఎమ్ ఇంజనీరింగ్ కళాశాల కడప, శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ లీ.సుధాకర్ రెడ్డి , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సదస్సుకు ఉమ్మడి కడప చిత్తూరు జిల్లాలకు చెందిన అన్నమాచార్య, గౌతమి, ఆదిత్య మరియు ఎం.జీ.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుండి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుండి 106 మంది విద్యార్థులు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నుండి 66 మంది విద్యార్థులు హాజరై టెక్నికల్ ప్రచురణలను సమర్పించి, టెక్నికల్ క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు యందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ కే. అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలని మరియు వివిధ కళాశాలలు నిర్వహించే వర్క్ షాప్స్, సెమినార్, వెబి నార్ , టెక్నికల్ క్విజ్ వంటి అంశాల పోటీలలో పాల్గొనాలని తెలియజేశారు. టెక్నికల్ సదస్సు నందు పాల్గొనడం వలన వివిధ టెక్నికల్ అంశాలను ఒకేచోట ప్రదర్శించి, చర్చించడం వలన అనేక అంశాలపై అవగాహన కలుగుతుందని, ఆత్మన్యూనతాభావం తొలగి ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగు పరచుకోవడం జరుగుతుందని వివరించారు . ఈ సదస్సులో డాక్టర్ వి. వెంకట్ రమణ మాట్లాడుతూ ఇటువంటి టెక్నికల్ ఫెస్ట్ నందు పాల్గొనడం వలన భావ ప్రకటన స్వేచ్ఛ పెంపొందించుకుని తద్వారా వివిధ అంశాలపై అవగాహన పెంచుకుని కమ్యూనికేషన్ స్కిల్స్ పై పట్టు సాధించగలరని తెలిపారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించి సేవాగుణం అలవర్చు కోవాలని సమాజాభివృద్ధికి తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అతిథులను, న్యాయ నిర్ణేతగా హాజరైన బాల చంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల కు ఘన నివాళి



**రాజంపేట అర్బన్ మార్చి 13 ప్రభాతవార్త**

మహిళలకి విద్యకు దూరంగా ఉన్న కాలంలో భగవంతుణ్ణి ధ్యానించి కేవలం ఐదు రోజుల్లో సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులోకి అనువదయించి శ్రీ కృష్ణ దేవరాయులు ద్వారా కీర్తింప పడ్డ తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల మాంబ అని రాజంపేట బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి అన్నారు. మొల్ల మాంబ 585 వ జయంతి ని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో కే ఎమ్ ఎల్ ఫౌండేషన్ చైర్మన్ నరసింహా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మొల్ల మాంబ చిత్రపటానికి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి అధ్యక్షతన ఉపాధ్యాయులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కే ఎం ఎల్ ఫౌండేషన్ చైర్మన్ నరసింహ ఈ స్కూల్ పాత స్టూడెంట్ అని , తన ఫౌండేషన్ ద్వారా మొదటగా తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతి ని ఇక్కడ నిర్వహించడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. కే ఎం ఎల్ నరసింహ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ కవయిత్రి మొల్ల ను ఆదర్శం గా తీసుకోవాలని కోరారు. ముఖ్యం గా పుస్తకాలకు దగ్గరగా ఉండి, సెల్ ఫోన్లకు దూరంగా ఉండమని హితవు పలికారు. కష్టపడి చదివి ఉన్నతోద్యోగాలను పొంది చదువుకున్న స్కూల్ కు, తల్లి తండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. తదనంతరం విద్యార్థినులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులను టీచర్స్ చే అందజేశారు. ఫౌండేషన్ తరపున శ్రీ రాముడి దివ్య చరితం రామాయణం గ్రంధాన్ని స్కూల్ లైబ్రరీ కి డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఎం.హైమవతి, ఎం.శ్రీదేవి, పి.కాంచన హెచ్.అమ్ములు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఏ.రమణయ్య, ఎస్.వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాధాకృష్ణ హోటల్ యాజమాన్యాన్ని అభినందించిన మున్సిపల్ కమిషనర్



**బద్వేలు అర్బన్, మార్చి 13 , ప్రభాత వార్త**

పట్టణంలోని రాధాకృష్ణ హోటల్ నందు అరిటాకులు, విస్తరాకులు వాడటంతో పాటు హైజీనిక్ పాటిస్తూ ప్లాస్టిక్ నియంత్రణ లో భాగమవడంతో కమీషనర్ మరియు మునిసిపల్ సిబ్బంది టిఫిన్ చేసి హోటల్ యజమానినీ మరియు హోటల్ సిబ్బందిని మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి అభినందిస్తూ సన్మానించడం జరిగింది. గురువారం ప్రజారోగ్య సిబ్బంది తో కలిసి పలు హోటల్ లు తనఖీ చేయగా ఆ హోటళ్ళ నందు విస్తరాకులు మరియు అరటాకులు వాడటం తో పాటు పరిశుభ్రత ను కూడా పాటిస్తున్నారని కమీషనర్ తెలిపారు. గతంలో ప్లాస్టిక్ కవర్ ల కంటే అరటాకులే తక్కువ ధరలో వస్తున్నాయని తెలియక ప్లాస్టిక్ కవర్ వాడేవాళ్ళమని హోటల్ యజమానులు కమీషనర్ కు తెలిపారు. పరిశుభ్రత పాటించడం మరియు అరిటాకులు వాడటంవలన కస్టమర్ల సంఖ్య పెరగడంతో పాటు హోటల్ నందు గూగుల్ రేటింగ్ కూడా పెరిగిందని హోటల్ యజమానులు మునిసిపల్ కమీషనర్ మరియు మునిసిపల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అరిటాకులు, విస్తరాకులు వాడుతూ పరిశుభ్రత పాటించడం ప్లాస్టిక్ నియంత్రణ లో భాగమైనందున హోటల్ యజమానులను మరియు హోటల్ సిబ్బందిని మునిసిపల్ కమీషనర్ అభినందిస్తూ సన్మానించారు.

## కాశినాయన క్షేత్రంలో కూల్చివేతలు బాధాకరం



**కాశినాయన, మార్చి13, ప్రభాతవార్త:**

కాశినాయనక్షేత్రంలో అటవిశాఖాధికారులు కూల్చివేతలు చేపట్టడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైసీపీ యువ నాయకుడు ఆదిత్య రెడ్డిలతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, ఫారెస్టు, పోలీసుశాఖాధికారులు క్షేత్రంలో కూల్చివేతలు చేపడితే ప్రభుత్వానికి తెలియదనడం విడ్డూరంగా ఉందని అవినాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్షేత్రానికి అటవి అనుమతులు ఇవ్వాలని కేంద్రమంత్రికి లేఖర రాశారని, కానీ కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి కూల్చివేతలకు పాల్పడందన్నారు. భక్తుల మనోభావాలతో కూడిన ఈ అంశాన్ని రాజకీయం చేయకుండా ఈక్షేత్రాన్ని కాపాడాలని కోరారు. ఈయన వెంట పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.

## సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు

**లక్కిరెడ్డిపల్లె; మార్చి 13, ప్రభాతవార్త**



మామిడిలో పూత, పిందెదశలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానవనశాఖ అధికారిని నాగమణి పేర్కొన్నారు. గురువారం. మద్దిరేవుల గ్రామంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మావి డిలో తామరపురుగులు సోకుకండా గట్లపై కలుపు మొక్కలు లేకుండా తోట చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎకరాకు 40 నీలంరంగు జిగురు అట్టల చెట్టుకొమ్మలకు కట్టాలని రైతులకు సూచించారు. తామరపురుగు నివారణకు జీవశిలింద్రనాశిని బవేరియాబాసియానా 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారు చెయాలన్నారు లేదా అజాడిరాక్టన్ 2 మిల్లీమీటర్ల నీటిని కలని పిచికారి చేయాలన్నారు. ఈరెండు నెలల్లో మామిడి కాయలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు చంద్రమ్మ, రైతు సేవాకేంద్రం సిబ్బంది లావణ్య రతలు పాల్గొన్నారు.

## కాశినాయన క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్



**బద్వేలు, మార్చి 13 (ప్రభాతవార్త):**

శ్రీ అవదూత కాశినాయన ఆశ్రమంలో జరిగిన కూల్చివేత వివాదం తారాస్థాయికి చేరడంతో గురువారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సందర్శించారు. ప్రస్తుతం ఈ అంశం రా ష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో అధికారులంతా వేగంగా క్షేత్రాన్ని సందర్శించి జరుగుతున్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వాటిలో భాగంగానే క్షేత్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను అధికారులు మరియు పూజారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల మనోభావాలు పరిగణనలోకి తీసుకునేందుకు కృషిచేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చేసే ప్రయత్నాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని త్వరలో అన్ని అంశాలు తెలియజేయడం జరుగుతుందని, ప్రస్తుతం జ్యోతి క్షేత్రానికి భక్తులు వచ్చేందుకు బస్సు సౌకర్యం కూడా కల్పించడం జరిగిందన్నారు. కూల్చివేసిన పరిసరాలన్ని పరిశీలించారు. ఈయన వెంట ఆర్డీవో చంద్ర మోహన్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సకాలంలో నీరు అందించాలి



**మైదుకూరు, మార్చి 13, ప్రభాతవార్త:**

కడప జిల్లా రైతు సేవా సమితి అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత రైతులకు ప్రాజెక్టులు పూర్తి చేసి సకాలంలో నీరు అందించాలని అంతేకాకుండా రాయలసీమ ప్రాంత రాజకీయ పార్టీల నాయకులే అధిక శాతం రాజకీయంగా పాలించిన రాయలసీమ భూభాగంలో 38 శాతం వ్యవసాయానికి అనుకూలంగా ఉండగా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా 7 ఏడు శాతం భూభాగానికి మాత్రమే సాగునీరు అందుతావుంది మిగతా కొంత భూభాగానికి రాజోలి,తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా వంటిప్రాజెక్టుల ద్వారా నీరు అందించేందుకు కొందరు ముఖ్యమంత్రుల ప్రయత్నంతో కృషి జరిగిన, కొందరు ముఖ్యమంత్రి నిధుల కేటాయింపులలో చేసిన నిర్లక్ష్యంతో 20 సంవత్సరాలు అవుతున్న ప్రాజెక్టులు పూర్తి కాక ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదు, తెలుగు గంగ ప్రాజెక్టు అయితే ప్రతి సంవత్సరం ప్రాజెక్టు పరిధిలోని ఎస్ ఆర్ 1, ఎస్ ఆర్ 2, బ్రహ్మం సాగర్ డ్యాములలోకి నీరు వస్తున్న ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు పొలాలకు నీరు అందించడానికి తవ్విన పంట,పిల్ల కాలవలను రక్షణ కల్పించి నీటిని సీజన్ల వారిగా ఖరీఫ్, రబీ కాలంలో ఆయికట్టుకు అందించడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయి. ఇప్పటికైనా రాయలసీమ రైతు సోదరులు, కడప జిల్లా రైతు మిత్రులు రాజకీయాల కతీతంగా ఐక్యమై పకృతి వైపరీత్యా ఆటుపోట్లను ఎదుర్కొనేందుకు పైన పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం ఎన్నికల ప్రచార సమయంలో రైతులకు ఇచ్చిన సంక్షేమ హామీల అమలు కోసం రైతులు ఐక్యత ఉద్యమించాలని లేకపోతే మరింత స్థాయిలో నష్టపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సంజీవరాయుడు, వెంకటేశ్వర్లు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

### వెలుగు ప్రత్యేక పాఠశాలకు

# మంచాలు వితరణ

**మదనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :**

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలకు కళ్యాన్, వెల్‌విషర్స్ సెక్రటరీ గిరీష్‌లు నాలుగు మంచాలు వితరణ చేశారు. గురువారం వారు వెలుగు ప్రత్యేక పాటశాలకు విచ్చేసి స్వర్గీయ నాగ రాజుగుప్త, సుందరమ్మల జ్ఞాపకార్థంగా వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మిలను మర్యాదపూర్వకంగా కలిసి మంచాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్ వర్కర్ గీత, వార్డెన్ స్వీటిలు పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యం కవయిత్రి మొల్ల



**రాయచోటి మార్చి 13 ప్రభాతవార్త**

మొదటి తెలుగు మహిళ కవయిత్రి అతుకూరి మొల్ల మాంబ మట్టిలో మాణిక్య విలువైన జాతికే మహిళ రత్నం కవయిత్రి మొల్ల అని అన్నమయ్య జిల్లా జాతీయ మహిళ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు డివిటి పద్మ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ సంస్కృతంలో రచించినటువంటి 24 వేల పద్యాల రామాయణాన్ని, కవయిత్రి మొల్ల తెలుగులో సులువైన భాష శైలిలో 871 పద్యాలతో కేవలం ఐదు రోజులు రాతి బండ పైన కూర్చొని లిఖించి, శ్రీ కృష్ణ దేవరాయలతో, ఆయన ఆస్థానములోని పండితులతో ,కొనియాడబడి మన్నలలో పొంది,ప్రఖ్యాతి కాంచిన మొల్లబాంబ కవయిత్రి. మనుషులందరినీ దేవుడు సృష్టించినప్పుడు తక్కువ కులము ఎక్కువ కులము ఎవరు చెప్పారు అని అప్పుడే ప్రశ్నించేది ,ఆడ,మగా సరి సమానమని కులమత బేధాలు లేవని అందరూ సమానమే అని సామాజిక న్యాయం కోసం మహిళ సాధికారత కోసం పోరాడేటటు వంటి మహిళ కవయిత్రిమొల్ల మాంబ కవయత్రి మల్లమాంబ జన్మదిన వేడుకలకు హాజరై సంభాషించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్ష రాలు దివిటీ పద్మ యాదవ్ మరియు కార్యవర్గము. మరియు కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షులు నాగేంద్రబాబు వారి కార్యవర్గము పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో రాణించిన అన్విత్ నందన్





**కలికిరి, మార్చి 13, ప్రభాతవార్త:**

రాష్ట్ర స్థాయిలో రాణించిన అన్విత్ నందన్ చదివేది ప్రభుత్వ పాఠశాల. అమమ ప్రభుత్వ ఉద్యోగి. తాత మాజీ సీఎం వ్యక్తిగత సహాయకులు. ఆర్థికంగా ఉన్నా ప్రభుత్వ బడిలో చదువుతూ బాల మేధావిగా పేరుతో పాటు గుర్తింపు సాధిస్తున్నాడు. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం చింతమాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో అన్విత్ నందన్ ఐదో తరగతి చదువుతున్నాడు. పోటీ పరీక్షల్లో విశేషంగా రాణిస్తూ అవార్డులు, ర్యాంకులు సాధిస్తున్నాడు. విభ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో నిర్వహించిన లీప్ ఫార్ వర్డ్ రాష్ట్ర స్థాయి పోటీలలో 3వ బహుమతి సాధించి ఔరా అనిపించాడు. రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతగా నిలిచిన అన్విత్ నందన్‌ను ఎంఈవో, ఉపాధ్యాయురాలు మెంటార్ భారతిని అభినందించారు.

## ఆదిత్య కళాశాలలో యోగాపై అవగాహన



యోగానుద్దేశించి మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :**

పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో యోగాఫర్ సక్సస్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్, దత్తక్రీయ యోగా ఇంటర్‌నేషనల్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దత్తక్రీయ యోగా ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ మైసూర్‌కు చెందిన వెంకట కామేశ్వర్‌రావు మాట్లాడుతూ యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరచడంతో పాటు ఏకాగ్రత పెంచుకొని, విద్య, ఉద్యోగ, జీవన విజయాలను సులభంగా సాధించవచ్చునన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, డాక్టర్ శివప్రకాష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అరుణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూటమి హయాంలోనే మహిళా సాధికారతకు పెద్ద పీట

**; మాజీ ఎమ్మెల్యే విజయమ్మ**



**బద్వేలు, మార్చి 13 , ప్రభాతవార్త**

పార్టీ ఆవిర్భావం నుండి ఏ పెట్టిందు కూటమి మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వస్తున్న పార్టీ టిడిపి అని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇంటిని సమర్ధవంతంగా నిడిపే మహిళ, రాజకీయాల్లోనూ మరింత రాణించి సత్తా చాటగలదని గుర్తించిన ఎన్టీఆర్ పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తి హక్కు కల్పించారన్నారు. దానికి కొనసాగింపుగా చంద్రబాబు మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి వారి జీవన స్థితిగతులను మార్చారన్నారు. మహిళల పేరుమీద ఇళ్లపట్టాలు, ఇంటి నిర్మాణం, భూమి కొనుగోలు వంటి పథకాలు ఎన్నో ఆచరణాత్మకంగా అమలు చేసి చూపించారన్నారు. దీనికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ 2025 26 బడ్జెట్ లో మహిళా శిశు సంక్షేమానికి రూ.4332 కోట్లు కేటాయించారన్నారు.2025 26 రాష్ట్ర బడ్జెట్ ప్రత్యేకించి మహిళల బడ్జెట్ అని చెప్పుకోవచ్చు నీ, మహిళల సంక్షేమానికి, ఆర్థిక పరిపుష్టికి తోడ్పడి రాష్ట్రంలోని మహిళల సాధికారతకు బాటలు వేస్తుందనీ, వైసీపీ హయాంలో రాష్ట్రంలో మహిళలు ఉన్నారన్న సంగతే మరిచి బడ్జెట్ లో వారికీ అన్యాయం చేశారన్నారు. అంగన్వాడీల గ్రాట్యుటీ చెల్లింపుల కోసం బడ్జెట్ లో 60 కోట్లు కేటాయించిందనీ ఆమె హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ

**కురబలకోట, మార్చి 13 ప్రభాతవార్త :**

అన్ని కులాలకు చెందిన స్త్రీలకు 18నుంచి 57లోపు వారికి ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామని కురబలకోట ఎంపిడిఓ గంగయ్య తెలిపారు. మహిళలకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, కాపు, మైనార్టీ 18నుంచి 55లోపు ఉన్న నెట్‌సెంటర్లు, సచివాలయాల్లో గాని ఓపిఎంఎంఎఫ్ ద్వారా ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. మండల కేంద్రంలో మహిళలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. మహిళలకు 45, 60, 90రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతోపాటు ఉచితంగా కుట్టుమిషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదివరకే లేవుట్లల్లో ఇండ్లు మంజూరైన లబ్దిదారులకు ఇండ్లనిర్మాణాలు పూర్తి చేసుకోని వారికి అదనపు ఆర్థికసాయాన్ని అందజేస్తామని ఎంపిడిఓ తెలిపారు. ఇదివరకే లేవుట్లలో అసంపూర్తిగా ఆగిపోయిన 960గృహాలు ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు. ఎస్‌సి, బిసిలకు రూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75వేలు చొప్పున కూటమి ప్రభుత్వం ఆర్థికసాయం మంజూరు చేస్తుందని తెలిపారు. లబ్దిదారులు ఈ ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకొని పక్కాగృహాలను సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన కోరారు.

## పేదల ముంగిటకే ప్రభుత్వ పథకాలు

**ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి**



**చిన్నమండెం మార్చి 13 ప్రభాతవార్త :**

అర్హులైన పేదలందరికీ వారి ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందించడం ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నమండెం మండలం, బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం గురించి అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేసి వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరిగింది.

## ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పీలేరు మార్చి 13 ప్రభాతవార్త :**

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం పిలుపునిచ్చారు. గురువారం జరిగినటువంటి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నందు జరిగిన ఆదేశాల మేరకు ప్రతినెల మూడో శనివారం జరుగు స్వర్ణాంధ్ర మరియు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల మూడో శనివారం జరగబోవు ప్లాస్టిక్ నిషేధంపై కలకడ గ్రామపంచాయతీ నందు గల చిరు వ్యాపారస్తులు మరియు గ్రామపంచాయతీ నాయకులతో, ఎంపీడీవో అబ్దుల్ రహీం, అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించమన్నారు. మండలంలో ఎక్కడ గాని ప్లాస్టిక్ వాడకం ఉండరాదని హోటళ్లలో, చౌక దుకాణాలు, చిరు వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడుతున్నాడు తెలిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని సూచించినట్లు తెలిపారు.అదేవిధంగా ప్లాస్టిక్ వాడుతున్నట్లు గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర ను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి టీ పారిజాన్ జావాద్ అలీ ఖాన్, తెదేపా నాయకులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

## రామచంద్రారెడ్డిని పరామర్శించిన మంత్రి



**చిన్నమండెం, మార్చి 13 ప్రభాతవార్త :**

మండలం, మల్లూరు గ్రామంలోని వంగిమళ్ళ రాంచంద్రరెడ్డి బైక్ మీద వెళుతూ కిందపడి కాలు ఫ్రాక్చర్ కావడంతో గురువారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చంద్ర శేఖర స్వామి వారి కళ్యాణోత్సవం



**రామసముద్రం. మార్చ్ 13 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని దిగుపేటలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న చంద్రశేఖర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కన్నులపండువగా శ్రీ చంద్ర శేఖర స్వామి వారి కళ్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. స్వామివారి కళ్యాణోత్సవమును తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు తండోపతండాలుగా ఉదయం ఆలయ అర్చకులు బాలస్వామి స్వామివారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించి విశేషాలంకరణ చేశారు.స్వామివారి దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. వృషభయాగం, ధ్వజారోహణం, ఉత్సవము, మధ్యాహ్నం కలిశారాధన, అగ్నిప్రతిష్ట, నిత్య హోమం, నిర్వహించారు. అనంతరం స్వామివారి బ్రహ్మోత్సవాల్లో 14వ తేదీ శుక్రవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం నిత్య హోమ, నిత్యోత్సవం, సాయంత్రం ధోపోత్సవం. ఈ కార్యక్రమంలో, స్వామి, బాలసుబ్రమణ్యం స్వామి, రవిస్వామి ఉబయ దారులు గబ్బురి గిరిజమ్మ, హరినాథ్‌శెట్టి, దీపిక, భదిరీనాథ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

**కురబలకోట మార్చి 13 ప్రభాతవార్త**

అంగల్లు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 10.03.25 (సోమవారం) చెన్నైకు చెందిన ఫస్ట్‌సోర్స్‌తో క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి తెలిపారు, మొదటిగా హెచ్ఆర్ అరుల్, కళాశాలకు విచ్చేసి విద్యార్థులకు కంపెనీ గురించి వివరించి వారు ఎంపిక అయిన తరువాత చేయాల్సిన పని గురించి వివరించారు. తరువాత విద్యార్థులకు అప్టిట్యూడ్ రౌండ్ నిర్వహించి 47 మంది విద్యార్థులను ఎంపిక చేసుకొని, గ్రూప్ డిస్కషన్ నిర్వహించి 35 మంది విద్యార్థులను ఎంపిక చేసుకొని, చివరిగా ఆన్లైన్ అసెస్మెంట్ నిర్వహించి 19 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఎంపిక అయిన విద్యార్థులు కస్టమర్ సర్వీస్ అసోసియేట్ గా పని చేయాల్సి ఉంటుంది అని వారికి సంవత్సరానికి మూడు నుంచి నాలుగు లక్షల వరకు జీతం ఉంటుంది అని ప్లేస్మెంట్ ఆఫీసర్ కేదార్ గౌరవ్ తెలిపారు. ఎంపిక అయిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమం లో ఫస్ట్ సోర్స్ హెచ్ఆర్ అరుల్, కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. రమణారెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ కేదార్ గౌరవ్, విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

